# ప్రెస్ నోట్

**సైబర్ నేరాల నుండి రక్షణకు అప్రమత్తంగా ఉండడమే పరిష్కారం: సీపీ సుధీర్ బాబు ఐపిఎస్**

**సైబర్ నేరాల పట్ల ప్రజలలో అవగాహన పెంచేలా రాచకొండ కమిషనరేట్ ప్రత్యేక ప్రచార వీడియోల రూపకల్పన**

రోజురోజుకు సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాచకొండ కమిషనరేట్ సామాజిక మాధ్యమ ఎకౌంట్ల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పలు వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు సైబర్ అవేర్నెస్ డే సందర్భంగా అంతర్జాల మోసాలు మరియు ఇతర సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం కోసం పలు అంశాల మీద రాచకొండ కమిషనరేట్ రూపొందించిన ప్రత్యేక వీడియోలను కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ గారు విడుదల చేయడం జరిగింది. ఈ వీడియోలను నెలరోజుల పాటు అంశాల వారీగా, మూడు నాలుగు రోజులకు ఒకసారి అన్ని సామాజిక మాధ్యమాలలో మరియు సమాచార ప్రసార మాధ్యమాల్లో విరివిగా ప్రచారం చేసి ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించనున్నారు. అంతేకాకుండా కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో, కాలనీల్లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పార్ట్ టైం జాబ్స్ అందిస్తామని మోసం చేయడం, సామాన్యులకు డబ్బు ఆశ చూపి వారి వ్యక్తిగత వివరాలతో సిమ్ కార్డులు మరియు బ్యాంక్ అకౌంట్లను తీసుకుని వాటిని సైబర్ నేరాల ద్వారా దోచిన సొమ్మును దాచడానికి ఉపయోగించడం కోసం వాడే మ్యూల్ అకౌంట్స్, షేర్ మార్కెట్ పెట్టుబడుల కోసం ఉపయోగించే ట్రేడింగ్ సంస్థల యాప్ లను పోలి ఉండే నకిలీ యాప్ లు తయారు చేసి మోసం చేయడం, నగ్న వీడియో కాల్స్ ద్వారా వ్యక్తులను హనీ ట్రాప్ కు గురిచేసి డబ్బు డిమాండ్ చేయడం, క్రిప్టో కరెన్సీ, ఆన్లైన్ బెట్టింగ్ ల ద్వారా అధిక లాభాల ఆశ చూపించి పెట్టుబడులు పెట్టేలా చేయడం, యువతీ యువకులు అత్యధికంగా ఉపయోగిస్తున్న ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలలో ఫ్రెండ్ రిక్వెస్ట్ ల ద్వారా పరిచయం పెంచుకొని వారి వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ ద్వారా అశ్లీల చిత్రాలు తయారుచేసి, వాటిని సదరు వ్యక్తులకు పంపించి వారిని మానసికంగా కృంగిపోయేలా చేసి డబ్బులు డిమాండ్ చేయడం, నకిలీ పోలీసు యూనిఫారం ధరించి వీడియో కాల్స్ ద్వారా అమాయక బాధితుల వ్యక్తిగత వివరాలు కొన్నిటిని చెబుతూ వారు నేరాలకు పాల్పడినట్టు భయపెట్టి వారిని డిజిటల్ అరెస్టు పేరుతో భయభ్రాంతులకు గురిచేసి డబ్బు డిమాండ్ చేయడం, తక్షణమే ఆన్లైన్ ద్వారా లోన్లు అందిస్తామని వ్యక్తులకు కాల్స్ మెసేజిలు చేసి, ఎటువంటి పూచికత్తు, పత్రాలు అవసరం లేకుండా వ్యక్తులకు లోన్ అందించి తర్వాత అధిక వడ్డీల పేరుతో అదనపు చార్జీల పేరుతో వారిని వేధించి సమాజంలో వారి కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించేలా వారిని బెదిరించి వేధించే లోన్ యాప్ లు, ఆన్లైన్ ద్వారా పాత వస్తువులను అమ్మకానికి పెట్టే సమయంలో అధిక ధరకు కొంటామని అమ్మకందారులకు ఆశ చూపి వారికి ఆన్లైన్ నగదు బదిలీ చేస్తామని చెప్పి మోసపూరిత నకిలీ పేమెంట్ లింకులను మరియు ఓటీపీలను పంపించి

వాటి ద్వారా సదరు వ్యక్తుల బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మొత్తాన్ని దొంగిలించడం వంటి పలు నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన పెంచడం కోసం ప్రత్యేక ప్రచార వీడియోలను రాచకొండ కమిషనరేట్ ఐటీ సెల్ విభాగం రూపొందించడం జరిగింది.

అంతేకాకుండా ఎటువంటి అంతర్జాల మోసాలకు మరియు సైబర్ నేరాలకు గురైనా భయపడకుండా తక్షణమే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయడం ద్వారా లభించే రక్షణను, నష్ట తీవ్రతను తగ్గించడం మరియు ఫిర్యాదు చేసే విధానాలకు సంబంధించిన వీడియోలను కూడా రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశేష కృషి చేస్తూ, సైబర్ నేరాలు అరికట్టడం కోసం ఎప్పటికప్పుడు వినూత్న కార్యక్రమాలు రూపొందిస్తున్న ఐటీ సెల్, సైబర్ క్రైమ్ మరియు సిసిఆర్బి అధికారులను కమిషనర్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ గారు మాట్లాడుతూ, నేటి ఆధునిక సాంకేతిక యుగంలో వివిధ రకాల అవసరాలకు ఎన్నో రకాల సాంకేతిక పరికరాలు ఉపయోగించడం జరుగుతోందని, సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకి కొత్త పుంతలు తొక్కుతోందని, అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తు నేరాలన్నీ ఎక్కువగా అంతర్జాలం ఆధారంగానే జరుగుతాయని, సమాజ అభివృద్ధి కోసం, పనులు సులువుగా కావడం కోసం ఉపయోగించవలసిన అత్యాధునిక సాంకేతికతను కొందరు నేరస్తులు తమ స్వలాభం కోసం అమాయక బాధితులను రకరకాల మార్గాల్లో మోసం చేసి దోచుకోవడం కోసం, అమాయక స్త్రీలను వేధించడం కోసం తప్పుడు మార్గాల్లో ఉపయోగిస్తున్నారని తెలిపారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల సైబర్ నేరగాళ్ళ బారిన పడుతున్న బాధితులకు అండగా నిలవాలని, అన్ని రకాల సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మరిన్ని ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో సైబర్ నేరాల పట్ల మరింతగా అవగాహన పెంచేందుకు రూపొందించిన వీడియోలను మరియు సైబర్ నేరాల మీద ఫిర్యాదు చేసేందుకు సంప్రదించవలసిన సైబర్ క్రైమ్ పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి, అదనపు డీసీపీ అడ్మిన్ శివ కుమార్, ఎసిపి ఐటి సెల్ నరేందర్ గౌడ్, సీసీఆర్బి ఎసిపి రమేష్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.


IPS
POLICE
SUN GROUP


RACHAKONDA
POLICE
WITH YOU FOR YOU